అపూర్వవాత్సల్యము

కోటా వెంకటేశ్వరరావుగారు

అది గోధూళికాసమయము. తన జీవయాత్రను ముగించి యపరదిగ్వధూతిలక యంకతలమున విశ్రమింపజనుచున్నా డాయన నాదిత్యుఁ డపరాంబుధిఁ గ్రుంకుచుండెను. నిజకులాలయంబుల డాయు శకుంత సంతాననిస్వనంబులు రోదసీకుహరంబున మారు మ్రోగుచుండెను. తమి మెల్లమెల్లన తలచూపు చుండెను.

కేలంబూనిన దీపకళిక వాయు విక్షేపంబునకు నారి పోకుండుటకై కరంబును వర్తమండలాకృతిగ నునిచి నళిని గృహాంతరమందలి తులసీకోటకు సూటిగ నడచుచుండెను. సాయంసమయంబున తులసీపూజ చేయుట యా యింటి గృహిణీమణులకు నాచారంబై యుండెడిది. నళిని మాతామహియు, పిదప నళిని జననియు తులసీపూజఁ జేయుచుండిరి. ఇప్పుడది నళినిపైఁబడ నామెయు దానిని వదలకఁ జేయుచుం డెను.

దీపకళికను తులసికోటపైనునిచి చేదోయి మొగిడ్చి శిరంబునాల్చి నిమీలితలోచనయై తదేక ధ్యానపరవశురాలై యట నిలుచుండెను. అదేలనో యన్ని రోజులకన్న నాదినంబున నామె దీర్ఘకాల మట్లుండుటయే గాక ద్విగుణీకృతభక్తిప్రపత్తిచిత్తంబుతో దేవిని నుతించుచుండెను. అట్టియెడ 'నళినీ' యనుపిలుపు వినబడెను. నళిని ఒక్కదాటున కవాటముఁజేరుకొనెను.

ఆజానుబాహుండును సుందరాకారుండునైన పురుషుఁడు ఇంటఁ బ్రవేశించి ఇంటి నంతట కలయ జూచుచు నొక సోఫాపైఁ జతికిలబడెను. ఇరులఁ దరుమ దీపం బెక్కడను గానరాదాయె. మిత్రాగమముచే ప్రఫుల్లయగు బిసరుహాంగనవోలె సోదరుని జూచుట తడవుగా మానసంబున నుద్వేగమగు విషయంబుల నడుగఁబూని మరల యడుగుట నుడిగి యతని వదనాంబుజమును వీక్షించుచు నిల్చుండె. భాస్కరుడు సైతము మౌనముద్రితుండై కూర్చుండెను. అతడా విషయంబును నిజసోదరి కెట్లు నివేదింతునా యని యోచించుచుండెను. ఇట్లింతలో నీపుండజాలక నళిని యాగ్రజుఁగాంచి సోదరాయని యూరకుండెను. ధ్వాంతసమితి యావరించిన యాగృహంబున నిశ్శబ్ద మెల్లయెడల నిండియుండెను. నళినీసంబోధితుడై యాతడు స్వప్నమునుండి తెప్పరిల్లినమాడ్కి సోదరిఁ గాంచి 'నళినీ' ఏమమ్మా, యని యూరకుండెను. 'సోదరా! కేసుముగిసెనా? యన, కంఠంబు సర్దుకొనుచు 'సోదరీ ఇంకను ముగియలేదు. పోలీసువారు ఇంకను అన్వేషించుచునే యున్నారు. వారికేదగిన యాధారములు దొరకమి కేసు విచారణకు రాదాయెను. అతడు నేరస్థుండని భావింపబడినను వారి సందేహము స్థిరపరుపజాలిన యంశమేదియు లభింపదాయె. ప్రస్తుతమున అతని విడుదలచేయుటతో దండించుటో నావాదిన్యాలముపై నాధారపడియున్న'దని బదులిడెను.

'ఏమి! నీ వెఱిఁగిన విషయంబులఁ గోర్టున నివేదించిన ఏమగు'నని నళిని భీతికంపిత గాత్రముతో ప్రశ్నించెను.

'దాని ఫలితము నీ వెఱుంగజాలినదే' యని యాతఁ డూరకుండెను.

నళిని యీ విషయంబును నెఱుంగును గాని నిజ సోదరుని పల్కులు వినులంబడ నిర్జీవప్రతిమవోలె

నిలువబడియుండెను. ఆమెకు తల బరువెక్కినట్లుండెను. నయనంబులు గిర్రున తిరిగి పోవుచుండెను. ఏదియో భయంకరాఘాతములోఁ బడిపోవుచున్నట్లు తోచెను. కొంత తెప్పరిల్లి తనయసహాయ స్థితిని గుర్తించెను. తటాలున నేదో యొక యభిప్రాయము తన మనంబునకురాగా నగ్రజుఁగాంచి 'సోదరా! ఆతనిపైఁ దేఁబడిన నేరము లసత్యమని వక్కాణించిన కేసెట్లు పరిణమించునో' యని యాతురతతో ప్రశ్నించెను.

నీలనీరదాచ్ఛాదితాంబరంబునఁ బొడమాపు విద్యుల్లతవోలె భాస్కరునివదనంబున దరహాసము తోచి యంతలో నంతర్హితంబయ్యె. 'అట్లయిన నాతడు విడుదలఁజెందు'నని నుడివెను.

తుదకు నిజమనోనాథుని విముక్తికి మార్గమొకటి యున్నదని మదిఁదోప దీనాననయై నళిని సోదరుని చరణంబులపై వ్రాలి 'సోదరా! అతని నిస్సహాయత్వమును పరికించుము. నిన్నుదక్క నాప్తులన్యులతని కెవరును లేరనుటఁ గుర్తించుము. అతని శిక్షాముక్తులు నీనుడువులపై నాధారపడియుండుటను యోచింపుము. అతని దుస్థితిని తిలకింపుము. ఎట్లైన నాతని గాపాడు'మని వేడుకొనియె.

అహితుండిట్లని నాగస్వరంబును గమనించునురగంబుపోల్కి భాస్కరుడు నిజసోదరి పల్కులను విని అమరత్వము జెందెనోయన గానఁబడుచుండెను. క్రమేణ యతని లోచనంబు లశ్రుపూరితంబులగుటం గమనించి యెంతో ప్రయత్నముపై నాపుకొనుచు 'సోదరీ భీతిజెందకుము. ధైర్యావలంబినివై యుండుము. అతని విడుదలకు కలయు ప్రయత్నములఁజేసి తుదకు ననువులఁ బాయవలసివచ్చినను వెనుకంజవేయ'నని సోదరిని యూరడించెను. సోదరీసోదరుల యక్షులంభఃకణపూరితంబులయ్యె

౨

నళిని మాతాపితృ విహీన. నళిని సప్తవర్షప్రాయురాలైయుండుతరి ఆమెజనని దివంగతురాలయ్యె. చతుర్దశవర్షప్రాయుడైన భాస్కరుని నళినిని వారి మేనత్త చేరదీసి పోషించుచుండెను. నళిని షోడశవర్షప్రాయురాలగుడు ఆమెను కమలకాంతున కిచ్చి వివాహము జేసెను. భాస్కరుడు సైతము కులశీలవయోగుణ రూపంబుల నొప్పారు కన్యకామణిని వివాహంబాడజూడ పర్షించుచుండ నామె యకాల మృత్యుకరాళవదనంబునంబడె.

కమలకాంతుడొక యనాథయువకుడు. ప్రాణసమంబైన సోదరి నొక ఘనియురాలైన విడిచియుండ నోర్వక భాస్కరుడొక యనాథయువకునకు తననిజ సోదరి నొసగిన భార్యాభర్తలు తన చెంతనే యుందురనే భావముతో నళినిని కమలకాంతున కిచ్చి తన చెంతనే యుంచుకొనెను. పాపమతనినున్నత విద్యావలంబకునిగా జేయవలయునని స్కూలు ఫైనలు ప్యాసుఅయినదే కమలకాంతుని కళాశాలలో ప్రవేశపెట్టెను. 'అన్యథాచింతితం కార్యం దైవమన్యత్ర చింతయే'త్తన్నట్లు అతడు చక్కగా జదువుకొనక దుర్మార్గులతోజేరి కాలమును వ్యర్థపుచ్చుచుండెను.

భాస్కరుడు దానిని గమనించి ఎన్నియోవిధంబుల ప్రాణంపుచెలికానివోలె అదనెరిగి పదునుచేయుచున్నట్లు ఎప్పటికప్పుడే యాతనిని మందలించుచుండెను. కొన్నాళ్ళకు కమలకాంతుడు తనమిత్రులతోజేరి దేశోద్ధారణకై పాటుబడసాగెను. కాని భాస్కరుడు వారాపేరున దేశద్రోహకార్యంబుల జేయుచుండుటను పసిపట్టెను. పాపమతనిఁజేరి ఎన్నియోవిధంబుల బుద్ధిచెప్పెను. 'పోగాలము దాపించినవారు దీపనిర్వాణగంధమును యరుంధతిని మిత్రవాక్యమును మూర్కొనరు, కనరు విన'రన్నట్లు పావన సద్బోధనంబు లాతనిచెంత వమ్మయ్యెను. నళిని కుసుమకోమలగాత్రి. పసిబాల. కృత్రిమకార్యముల నెరుంగజాలని కురంగాక్షి. పతిచరణంబులే పతికి గతియని తలపోయు రాజీవలోచన! నిజభర్తకు కటు

274

భయభక్తులతో సేవలుచేయుచు నాతనిని ప్రాణంబుల కన్న నెక్కుడుగ ప్రేమించుచుండెను.

ఈ లిద్దరిగుణంబులభేదము వితర్కించ భాస్కరుని డెందము చింతాకులమైపోవుచుండెను. నిజభగిని నయనంబు లశ్రుకణంబులు తొరంగుట గాంచజాలక తనబావనుఁదిని మందలించ వెనుకంజవేయుచుండెను గాని వచనంబునమాత్రము. అతఁడు కమలకాంతునియందు గొప్పనేరముఁ జేయుచున్నాడని యెఱుంగును. తాను విషమస్థితిలోనుండి ఏమియు చేయజాలడయ్యె. తదనుగుణంబుగా నగరంబున నొకభయంకర నేరమొకటి జరిగెను. అతడే ఘోరకృత్యమును జేసెనని భాస్కరుడు చక్కగానెఱుంగు దానిని వెలిబుచ్చినచో కమలకాంతుడు శిక్షింపబడును.

అట్టి గతికి తనప్రాణేశుడు పాలుబడెనని వినిన నళినికిని మిన్నువిరిగి నెత్తినబడునని భాస్కరుడు మన్నుదిన్నపామువలె పడి యూరకుండెను. తాను ఎన్ని ఇడుములనైనను గుడుచునుగాని ఏక్కారణము చేతను తనసోదరి దుఃఖించుట గాంచజాలడు.

అట్టియెడ ఒక పాశ్చాత్యవనిత ధూమశకటంబున నరుగుచుండ కొందరు దుర్మార్గులామెతో మొదటి తరగతిబండిలో ప్రయాణముచేయుచు నామెపై నత్యాచారముసల్పి యామె భూషణంబుల నపహరించినవార్త దేశమంతయు మారుమ్రోగుచుండెను. అంతకుపూర్వము జిల్లామేజస్ట్రీటు గృహావరణంబున ఫిరంగిప్రేలినది యెందరెఱింగినదే. ఆ నగరపోలీసువారాదుండగీడులఁ బట్టుకొన విశ్వప్రయత్నములు సల్పుచుండిరి. ఇంతకు నొకడే వీటిని సల్పియుండడు ఏదో దేశద్రోహ సంఘమేర్పడి యిట్టి దుష్కృత్యములు సల్పుచున్నారని యందరు తలంచుచుండిరి. సందియముపై కొందరు విద్యార్థులు బంధింపబడిరి. వారిలో కమలకాంతుడొకడు. అందరిని విడిచిపెట్టిరిగాని యాతనినిమాత్రము విడువరైరి. పోలీసు అధికారుల ప్రశ్నలకు తగుసమాధానమీయనందున అతనిపై నేరము మరింత దృఢపడెను.

అప్పటినుండి కమలకాంతుడనిన భాస్కరునకు కడునసహ్యత. ఆ ఘోరకృత్యము జరిగిన మరుదిన ముదయమున యాతడింటికివచ్చెను. ఆకస్మాత్తుగా కమలకాంతుని వ్రేలవజ్రపు టంగుళీయకముండుటను భాస్కరుడుగాంచి విషణ్ణుడాయెను. నారీమణుల ప్రాణమానంబుల గాచుట సకలజనసమ్మతమైయుండ ఒక వనితామణి ప్రాణమానంబుల నపహరింపబూనిన మానవుని మన్నించుటకు మన భాస్కరుని మనం బీయకొనునా? కాని ఏకగర్భజనితయైన నళినిముఖంబునందు విషాదచ్ఛాయ లలముకొనుటఁ జూచి సహింపజాలమిచే భాస్కరుడు తన బావనుఁదిని మందలింపక యూరకుండెను.

అతని కెన్నటికిని స్వసుఖమునం దభిరుచియుండదు. అనయము సోదరీసౌఖ్యమునకే పాటుబడుచుండును. ఆమె సంతోషమే తన సంతోషముగా భావించును. ఆమె సౌఖ్యాంబుధి నోలలాడుటయే తన జీవితసారమని మది వితర్కించుచుండును. అతని నెవరైనను 'వివాహమాడవైతివేమి?' యనిన 'నాకరి తియమునకు ఏయావశ్యకత కనంబడదు. నేను అనయము నుత్సాహపూరిత చిత్తుండను. నేను గన్నసుతుడైన నేమి నాసోదరికి యుద్భవించిన నందనుడైన నేమి? నా భగినిపుత్రుల ముద్దుమురిపెములఁ గాంచుచు నా దినంబుల గడుపుదు' నని చిరునగవు కెంపెదవుల దళుకొత్త భాస్కరుడు బదులిడుచుండును.

విపణివీధుల నొకయువకుడు విలువగల యొక యుంగరము నమ్మజూపుచుండగా పురరక్షకభటులు అనుమానముపై వీనిని ఠాణాకు గొంపోయిరి. అచ్చట విషమప్రశ్నలను వేయగా తగు సమాధానమీయ నశక్తుడైనందున వానిపై యనుమానము మరింత దృఢపడెను గాని, తాను తప్పించుకొనుటకు యుంగరము తనకు తనబావయిచ్చి యమ్మమనెనని వాక్రుచ్చియుండెను. మరునాడతడు తనవాఙ్మూలమిచ్చిన తొలి యువకుడు నిర్దోషియని నిర్ధారణమగును. భాస్కరుని

నోటిమాట యొక్కటిచే కమలకాంతుడు విడుదల గాంచుననుట నిక్కమే!! అయినను భాస్కరునికి దీర్ఘకాల కారాగృహవాసము నాహ్వానించుట యగునుగదా. అంతకన్న మిన్నయైన యాత్మగౌరవము ప్రజావిశ్వాసముల గోల్పోయి చోరుడని జారుడని హంతకుడని పేరుమోసిపోవలసి వచ్చుగదాయని యాతడు వాపోవుచుండును.

ఇవన్నియు తన సోదరీప్రేమను పరితూగగలవా. ఆ భగినీసంతసమునకై యావజ్జీవకారాగారవాసంబును దుర్భరావమాన జీవితంబు గడుపుటకైన నీయకొనును. నళినికై యాతడెంతకుం దెగువ జేయును. కమలకాంతునకు కారాగృహవాసంబు సంప్రాప్తమయ్యెనని ఏవిధమున తనసోదరికి నుడువ గలడు? సోదరి తన్నుజూచి, 'సోదరా! నీవుండియు నీబావమఱఁదిని కారాగారవాసంబున కనిపితివా?' యనిన నాతడు బదులేమీయగలడు. అంగుళీయకము లభించుటచే నెవరో యొకరు శిక్షఁబొంద వలయును గాన భాస్కరుడే శిక్ష బొందుటకు నిశ్చయించుకొనెను.

తాను గృహంబువీడి చనిన తనసహాయము లేమిచే నళిని యెంతవగచునో!! అన్నపానీయముల వర్జించి యెంత కుందునో!!యని ఒక్కమారు తన మనంబునతలంచెను. కాని యది యాతనికి కమల కాంతుని కారాగృహవాసముకన్న యెక్కుడుగా కనబడదాయెను. భాస్కరుడు తన శిరంబును తన యిరుకరంబుల నునిచికొని చింతాకులచిత్తుండై దీర్ఘాలోచనమున మునింగిపోయెను.

3

కేసు విచారణదినం బాసన్నమాయెను. ఆదినమున న్యాయశాలకు జనుటకుపూర్వము భాస్కరుఁడు తన ముద్దుపెంపుభగినిఁజేరబిల్చి ప్రేమమెయిఁగౌగిలించి శిరంబునుమూర్కొనియెను. నళిని చింతాకులచిత్తయైనందున యాతని యక్షిద్వయంబునుండి యశ్రుకణంబు లవారిగా మస్తకంబుపై బడుచుండినవి. ఆమె దానిఁ గుర్తించలేకపోయెను. ఉత్తమాంగము నొకించుక పైకెత్తి 'సోదరా! అతడు విముక్తి గాంచడా?'యని యడిగెను.

భాస్కరుఁ డంత స్వార్థరహితమనస్కుండై నళినీముఖంబుపై బడుచుండిన యామె వినీలకుటిలకుంతలంబులఁ జక్కదిద్దుచు 'సోదరీ! ఏల యాతడు విముక్తినొందడు? అనతికాలంబులోనే యాతడు నిర్దోషియని నిరూపింపబడి మనగృహంబున కేతెంచును. నీవు చింత దక్కయుండుము. అతడు ఇంకను తన స్థితిగతుల నెరుగజాలనిచో నాతనిని మందలించుము నొకింత జాగ్రత్తగానుండుము. అతనిని ఇఁకపై కళాశాలకు ననుపరాదు. గృహస్థ ధర్మావలంబకుడై తత్కృత్యంబులను తీర్పజాలునట్లు అతనిని దిద్దవలసిన భారము నీపై నున్నయది'యని పల్కి మిన్నకుండెను.

భయసంభ్రమములు ముప్పిరిగొన తనసోదరుని గాంచి 'యన్నా! నీవే యాతనికవ్విధంబును నేర్పం జాలుదువు. అంతియగాక నాపల్కులను పాటించెదరా? నీవే చెప్పవలయును'అన,

'సోదరీ యాలాగే కానిమ్మ. ఇకపై నాతడు తన దుండగీడుతనంబును మాని సన్మార్గప్రవర్తకుఁడగును. అతడు నీపల్కులను తప్పక యాలకించును!! నేను నాతని మందలించుచుందును. నీవును నాతనికి బుద్ధి జెప్పుచుండు'మని బదులిడెను.

భాస్కరుడు పరోపకారపారీణుడని పేదలపాలిటి కల్పతరువనియు సుగుణఖనియనియు నగరమందంతటను ప్రఖ్యాతి గాంచియుండెను. తానే దేశద్రోహ కార్యసంఘసభ్యుడననియు, నిదివఱకనేక దుండగములు జేయుచుంటిననియు, రైలుబండియందు దావాడు ఆంగ్లేయవనితను హింసించి యామె యాభరణంబు లపహరించెననియు మరియు నా యాభరణంబులలో నొక్కటియైన యావజ్రపుటుంగరమును తా నమ్మజాలక కమలకాంతుని నమ్మబంపిననియు,

278

కమలకాంతుడు నిర్దోషియనియు భయకంపిత చిత్తు డగుటఁజేసి యవ్విధంబున వాఙ్మూలము నిచ్చియుండెననియు నిందుకోర్టునఁ నుడివిన నేమానవుడు సంభ్రమాశ్చర్యములఁ ముప్పిరిగొని రిత్తవేయక యాతని దిలకించకుండును!! ప్రతిపురుషుడును 'అయ్యో! ఇట్టి సుగుణవంతు డిట్లు చేసియుండ'డని కలగకమానడు గదా!

దోషినిగుర్తింప నాయాంగ్లేయవనిత కోర్టులో హాజరైయుండెను. భాస్కరుడే తాను దోషియని నుడువగా నాంగ్లేయవనితయు ఆతడే తన్ను హింసించెననియు నుడివెను. హైందవులను గుర్తింప నశక్తురాలు గనుక భాస్కరుడే రివాల్వరుతో తన్ను గాల్చజూచెనని యామె దిట్టముగా నుడివెను. అంతట కమలకాంతునివిడిచి భాస్కరుని ఆతని స్థానమున నిల్వ నాజ్ఞాపింపబడెను.

కమలకాంతుడు నిర్దోషియని నిరూపింపబడి విడుదలచేయబడినను తనస్థానమునుండి యొకయడుగైనను కదలింపజాలక ప్రాణుపట్టినుమాడ్కి నిలువబడియుండెను. భాస్కరుని పల్కొక్కొక్కటియును ములుసువలె నాతని హృదయసీమను గ్రుచ్చుచుండెను అతడప్పుడప్పుడు భాస్కరుని మాటలకు నడ్డుపలుకజూచెను గాని ఏలకో యాతని నోటివెంట నొకపలుకైన వెలువడదాయెను. భాస్కరుడు దోషియని నిరూపింపబడి పదునాల్గేండ్లు ద్వీపాంతరవాసశిక్ష విధింపబడెను. కమలకాంతుడు భాస్కరుని వదనాంబుజంబును గాంచెను. అప్పుడున్ను ఆతని వదనంబున గంభీర ధైర్యస్థైర్యములు తాండవమాడుచుండెను. కమలకాంతు డట్టెంతో సేపు భాస్కరుని గాంచజాలకపోయెను. అవమానపూరిత చిత్తంబు దుఃఖమున చీలిపోవుచుండెను. ఇరుకరంబుల తనవక్షంబును వదిమిపట్టుకొనెను.

భాస్కరుని కారాగృహమునకుఁ గొనిపోవుతరి యాతని హస్తశృంఖలాశబ్దంబునకు చైతన్యంబుకెంది సుగుణసంపన్నుండును సోదరీవాత్సల్యపూరిత చిత్తుండును నిర్దోషియగు పురుషుండు దోషియని నిర్దేశింపబడి తాను నిర్దోషియని విడుదలపొందుట కమలకాంతునకు విస్పష్టముగ గోచరించుచుండెను.

కమల కాంతునితో మాట్లాడుటకు ననుజ్ఞపడసి భాస్కరుడు ఆతని చెంతనిల్చెను. కమల కాంతు డాపాదమస్తకము వణకిపోవుచుండెను. ఆతనిని గాంచి 'నీవు ఇంటికిపొమ్ము. నీవిప్పు డెంతగౌరవముతో విడుదలగాంచితివో యిట్లే నీజీవితకాలంబును గౌరవముతో గడుపునట్లు యాసర్వేశ్వరుడు నీకనుగ్రహించుగాక. నాసర్వస్వమ్మును నీకును నళినికిన్ని ఇచ్చివేయుచున్నాను. నేను మగిడి ఏకాంతునని స్వప్నమునసైతము నిరీక్షింపవలదు. నళినితో — నళినీ నామంబు నధరంబులలో వెలువడ నాతనికంఠంబు రుద్ధమగుచుండెను. నయనంబుల నశ్రుకణంబులు కాలువలుగట్టి పారుచుండెను. అసుఃఖాతిరేకంబున పెదవులు తొట్రిలుచుండెను. ఎట్లోసర్దుకొని ప్రయత్నపూర్వకముగ నాతనిగాంచి 'నేను ఈదేశంబును వీడుకొని నామె జీవయాత్ర సుఖప్రదముగను సంతోషదాయకముగను గడుపునుగాకయని దీవించితి'నని యామెతో నుడువుము. అనూతనసీమయందు ఎరింగిన మోమొక్కటియు గాన్పించని నెలవున నాముద్దు చెలియలి సుందరవదనంబు బింబమే నాజీవయాత్రకు నూతకొమ్మగా నుండునని వచియింపుము. నేను నాజీవితంబును విలువగలదని యెంచబోను. ఏయబల సుఖంబునకై ఎవ్వరిసంతసంబునకై నాజీవితంబును గడుపుచుంటినో యాపూర్ణేందుముఖియగు నాప్రియ సోదరి యధరంబులపై దుఃఖరేఖ దోచకుండుటకై యీయంతులేని నాయాత్రకు నుంకించితినని ఆమెతో నుడువు'మంచు భాస్కరుడు నుడువ కాంతుడు సోదరా యటంచు యాతనిపాదములపై వ్రాలెను. కాంతునిగాంచి 'మిత్రమా! డింభకునివోలె ప్రయత్నించకుము. లేచి యింటిదారిఁబట్టుము. కంటిక

మింటికి నేకధారగా నేడ్చుచు నళిని నీకై నిరీక్షించుచుండును. ఆమెను శాంతవచనంబుల నోదార్చను. వర్షాంతమునకో మరుసంవత్సరమునకో వత్తునని నుడువు'మనిపల్కి యాతనిపై కడపారి చూడ్కుల నిగిడించి పోలీసువారివెంట నేగెను. తడబడు నడుగులతో కాంతుడు యింటిదారిఁబడెను.

౪

వర్షాగమమునకై వేచియుండు చాతకంబుకైవడి, ఆహారాన్వేషణంబునకై చనియుండు మాతకై వేచియుండు శకుంతసంతానంబుచూడ్కి నళిని తన ప్రియునికై నిరీక్షించుచుండెను. అల్లంతదవ్వున నిజవిభుడు చనుదెంచుటఁగాంచి సంజవేళ మగుడి యేతెంచు పెండవునుజూచిన వత్సంబుపంబోలె నిజధవుని నొక్కచెంగున కలసుకొనెను. చంద్రోదయంబునుగాంచిన జలజంబుచాడ్కి వన్నెదక్కియుండిన యావదనంబున స్వశ్రుకణంబులు దొరలి మచ్చలుబడి యాకపోలతలంబును జూచిన నా మంద యాన యానినంబంతయు వాపోయినట్లు పాడఁజూపుచు—

'ధర్మస్వరూపులైన యాన్యాయపతి మీకు స్వేచ్ఛను దయజేసెఁగదా? మిమ్ము మరల ఖైదీ చేయరుగదా?' యని మించినయాతురతతో నళిని ప్రశ్నించెను. తెచ్చుకోలు చిరునగవు కెంపెదవులఁ దొలకాడ 'ప్రేయసీ! వారు నన్ను బంధించియేయుందురు. నిజముగా నీకాంతుడు దోషియేయగు. ఆఘోరమునకు ద్వీపాంతరవాసశిక్షనుబొంది యుండు'నను పల్కులు చెవులఁబడ నళిని యప్రయత్నముగ యాపాదమస్తకంబు వణకిపోవుచుండెను. అతనిఁగాంచి 'వల్లభా! మీరిక నిట్టికఠినంబులైన నుడువులఁ బల్కబోకుడు. మీరిప్పుడు స్వేచ్ఛావిహారంబునుబొంది వచ్చితిరిగదా. దుర్జనసాంగత్యము బోనాడి సన్మిత్రులఁబడసి ధర్మమార్గాచరణులగుడు.' అటంచు దీనవదనాబ్జయై యాతని చరణంబుల కెరిగెను.

కాంతుని డెందము దగ్ధమైపోవుచుండెను. మాటలాడనోడి రాతిప్రతిమవోలె నిల్వఁబడియుండెను. 'ఆహా నా స్వేచ్ఛకై ఎట్టిమానవోత్తముని గోల్పోయితి!! తన ప్రాణంబుల మిన్నయని చింతించు నళిని నెట్లోదార్పజాలుదు. సోదరుడే సర్వస్వమ్మనియెన జింతించు నామె నెట్లు ఊరడింతు'నని యాతఁడు మదిఁ గలపోయుచుండె. నాతనిశిరంబు దిరుగుచుండునట్లు గోచరించె. ఆతని నయనంబులు ఇలాతలంబు ధ్వాంతపూరితంబైనట్లు జూపట్టుచుండె. కాంతుడు నిలువజాలక పోయెను. శరీరం బస్వస్థతగా నున్నదని నుడువుచు తనగదికిఁజని పరుండెను.

పోలీసువారి యాధీనంబునం దుండుటచే నాతని దేహంబు బాగుండలేదు కాబోలని నళిని మనంబున చింతించుచుండె. శీఘ్రముగ రుచికరభోజనంబు తయారుచేయుచుండెను. ఆమెమనంబు నిజ మనోహరునియందు లగ్నమైయుండినందున నిజసోదరుని గూర్చి తలపోయదాయెను. వంటపూర్తియైనదే నిజసోదరుడు వచ్చునని యెదురుజూచుచుండెను. అప్పుడప్పుడు వ్యాయామమందిరంబునకు జనుచుండునందున గృహంబున కాలస్యంబుగ వచ్చుచుండెను. ఆ దినంబు సైత మల్లె వేచియుండి యెంతకు మగుడి రానందున నళిని కాంతునిజేరి 'నాథా! మాయన్న రాత్రొద్దగు. మీరు వేచియుండుటెందులకు? మీరు భుజించి విశ్రమింపు'డని వేడుకొనెను.

కాంతుడు పాన్పుడిగ్గడు; బదులు పలుకడు. నళిని మరలమరల ఆతనిని భోజనంబునకై లేపెను. ఎంతకు కాంతుడు లేవడాయెను. అంతట నళిని యతని చరణంబులతో కదిల్చిలేప మరింత చెంతకు డాయగ యాతడు ముఖంబునకు దిండుమాటుగ జేసుకొని వెక్కివెక్కి యేడ్చుచుండుటను తిలకించెను. అతనినట్లే కౌగిలించుకొని, 'నాథా! మీరిట్లు శోకాక్రాంతులై యుండుటకు గతంబెయ్యది?' యన నతడు మరింత యెక్కువగ వాపోవదొడంగె. ఆమెను